క్లుప్తంగా

వేరే ప్రాంతానికి చెత్త తరలింపు



ట్రాక్టర్‌తో తరలిస్తున్న చెత్త

సాక్షి ఎఫెక్ట్...

పాచిపెంట: మండల కేంద్రంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త పంచాయతీ పారిశుధ్య వాహనాల ద్వారా పెదగెడ్డ జలాశయం సమీపంలో పర్యాటక ప్రాంత అభివృద్ధికి కేటాయించిన స్థలంలో వేస్తున్న నేపథ్యంలో డంపింగ్ యార్డ్‌లా పెద్దగెడ్డ శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. పెద్దగెడ్డ జలాశయం పరిసర ప్రాంతంలో గతంలో వేసిన చెత్తను మంగళవారం వేరే చోటుకు తరలించారు. భవిష్యత్తులో పెద్దగెడ్డ జలాశయం పరిసర ప్రాంతాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

సీతానగరం: మండలంలోని పాడి పశువులు, దుక్కిటెడ్లు పెంపకదారులంతా తమ వైద్యులు గ్రామాల్లో వేస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీలు డాక్టర్ ఎ.ఉషారాణి, డాక్టర్ ఎం.హిమజ అన్నారు. మండలంలోని జోగింపేట, సీతానగరం తదితర గ్రామాల్లో నిర్వహించిన గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరాలను మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఈ నెల 15 వరకూ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు కె.జానకీరాం, సీహెచ్ శిరీష, బి.లక్ష్మి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్యాంసుందర్

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ సెలక్షన్, అండర్ 14, 17 స్థాయి ఆటల పోటీలను ఎంఈవో ఎం.శ్యాంసుందర్, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.భారతి మంగళవారం ప్రారంభించారు. బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత తెలిపారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బలిజిపేట: వంతరాం నుంచి గలావల్లి 11కేవీ లైను ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించనున్నందున దీని పరిధిలో ఉండే గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సింహాచలం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జాతీయ రహదారిపై గోతుల పూడ్చివేత



జేసీబీతో రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై రెస్టారెంట్, చినబోగిలి – సీతానగరం మధ్య ఏర్పడిన గోతులకు ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. రోజూ వందలాది వాహనాలు తిరుగాడే రహదారిలో గోతులేర్పడిన వాహన చోదకులు, ప్రయాణికులు పడుతున్న అవస్థలను ఆదమరిస్తే ప్రాణాలు గాలిలో కలిసిపోవడం ఖాయం శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. యంత్రాలతో గోతులు పూడ్చివేత చర్యలు చేపట్టారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: వన్యప్రాణులను సంరక్షించుకోవాలని, ఇది మనందరి బాధ్యతగా భావించాలని అటవీ శాఖ సిబ్బంది ప్రసాద్, రామారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు జరుగుతాయని, దీనిలో భాగంగా ప్రతి గ్రామానికి వెళ్లి వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు.

పుర పాలనపై మితిమీరిన జోక్యం



చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి మాట్లాడుతున్న క్రమంలో జోక్యం చేసుకుంటూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- చైర్‌పర్సన్ అధికారాలకు అడ్డుకట్టగా ఎమ్మెల్యే
- అప్రజాస్వామ్యంగా సమావేశం హైజాక్

పార్వతీపురం రూరల్:

పార్వతీపురం మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించగా మరోసారి సమావేశంలో గందరగోళం పరిస్థితులు నెలకొన్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యే చైర్‌పర్సన్ అధికారాలకు అడ్డుపడుతూ మితిమీరిన జోక్యం చేసుకుంటూ సమావేశాన్ని అంతా తానై నడిపించారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన చైర్‌పర్సన్ గౌరీశ్వరినీ లక్ష్యంగా చేసుకొని ఆమె స్థానానికి గౌరవం ఇవ్వకుండా సమావేశాన్ని రాజకీయంగా అప్రజాస్వామ్యంగా హైజాక్ చేశారు. ప్రణాళిక ప్రకారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన సమావేశం ప్రారంభమైనప్పటికీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే విజయచంద్ర ఆది నుంచే పెత్తనం చలాయించారు. ప్రతీ అంశంలోను జోక్యం చేసుకుంటూ చైర్‌పర్సన్‌ను మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారు. ఎమ్మెల్యే తీరుతో తీవ్ర ఆవేదనకు గురైన చైర్‌పర్సన్ అజెండాలోని అంశాలను పూర్తి చేసి సభ ముగిసిందని ప్రకటించి ఆత్మగౌరవంతో బయటకు నడిచారు. అయితే దీన్నే అదునుగా భావించిన ఎమ్మెల్యే తన అధికార అహాన్ని ప్రదర్శించారు. చైర్‌పర్సన్ మధ్యలోనే వె వెళ్లిపోయారంటూ వ్యాఖ్యానిస్తూ నిబంధనల పేరుతో మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన కౌన్సిలర్ మంత్రి ఉమామహేశ్వరి చేత తాత్కాలిక అధ్యక్షురాలిగా కుర్చీలో కూర్చొబెట్టారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన చైర్‌పర్సన్‌ను కాదని ఒక ఫిరాయింపు కౌన్సిలర్ అధ్యక్షతన రూ.60లక్షల పనులకు అధికార దుర్వినియోగంతో ఆమోదం తెలిపారు.



తాత్కాలిక చైర్‌పర్సన్ అంటూ చైర్‌పర్సన్ సీట్లో మంత్రి ఉమామహేశ్వరిని కూర్చొబెట్టి సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కుట్రలో భాగమేనా..

తనను ఉద్దేశపూర్వకంగానే అవమానించి బయటకు వెళ్లేలా ప్రేరేపించారని, అజెండా పూర్తి చేశాకే తాను బయటకు వెళ్లానని చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అవిశ్వాస తీర్మానంతో తనను గద్దె దించేందుకు ప్రయత్నించి విఫలమైన ఎమ్మెల్యే ఇప్పుడు ఈ విధంగా దౌర్జన్యంగా తాత్కాలికంగా సభను హస్తగతం చేసుకోవడంపై పలువురు ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. అలాగే మితిమీరిన అత్యుత్సాహంతో సభ నియమాలు ఉల్లంఘించి సమావేశ మందిరంలోకి టీడీపీ కార్యకర్తలు, నాయకులు వచ్చి ఏకంగా చైర్‌పర్సన్ కుర్చీ వద్ద తాత్కాలిక చైర్‌పర్సన్ అంటూ ఉమామహేశ్వరిని సన్మానించడం పట్ల ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఇది సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశ వర్కర్ల నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు మంగళవారం పలు ప్రాంతాల్లో నిరసన తెలిపారు. బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీల వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. తమను రెగ్యులర్ చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మన్మథరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వేణు, జి.వెంకటరమణ, యూనియన్ నాయకులు లక్ష్మి, అరుణ, వీరమ్మ, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
– బలిజిపేట

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించండి



గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. ఎంఎం నాయక్‌కు వినతిపత్రం అందజేసిన రంజిత్‌కుమార్

పార్వతీపురం రూరల్: జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో విద్యార్థుల మరణాలు కొనసాగుతున్నాయని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13మంది గిరిజన విద్యార్థులు మృతి చెందారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. ఎంఎం నాయక్‌కు మంగళవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానమైన డిమాండ్లలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబానికి కనీసం రూ.5లక్షలు నష్ట పరిహారం చెల్లించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. పెరుగుతున్న ధరలు దృష్ట్యా డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని గిరిజన విద్యా సంస్థల్లో సంబంధిత శాఖా మంత్రి ఇచ్చిన హామీను అమలు చేసి ఏఎన్ఎంల నియామకాలు చేయాలని కోరారు. ఐటీడీఏకు రెగ్యులర్ పీవో, డీడీలను నియమించి పాలన గాడిలో పెట్టాలని కోరారు.

గ్రామ కమిటీలకు ప్రాధాన్యం



వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ ఏర్పాటుపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న రాజన్నదొర

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీలో గ్రామ కమిటీలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు ఆ పార్టీ పీఏసీ సభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో తన స్వగృహం వద్ద అన్నంరాజువలస, కందులపథం, కొట్టుపరువు, మావుడి, తుండ, పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు, కొదమ, గంజాయిభద్ర, సారిక, కురుకూటి, తోణాం, కొత్తవలస తదితర పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. గ్రామ కమిటీలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ కమిటీల ఆవశ్యకతను వివరించారు. కమిటీల ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో రానురాను అసంతృప్తి పెరుగుతోందన్నారు. రానున్నది మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా, సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో శిరీష

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతాలలో పోడు భూముల్లో చిరుధాన్యాలు పండించడం వలన గిరిజనులకు అధిక లాభాలతో పాటు ఇంటికి వాడుకోవడంతో పౌష్టికాహారం లభిస్తుందని ఏవో కె.శిరీష అన్నారు. గంజాయిభద్ర రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న దిగువ సెంబి గ్రామంలో ఏవో ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన రైతులు పోడు మరియు అటవీ భూములు సాగు చేస్తుంటారని అందులో చిరు ధాన్యాలు పండించడం వలన మంచి లాభాదాయకమని వివరించారు. రాగి, సామలు, కొర్రలు, వ్యవసాయ మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



సీహెచ్‌వో వెంకటరమణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశాలు

సీతానగరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిరంతరం గ్రామాల్లో సేవలందిస్తున్న ఆశా వర్కర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వి.వెంకటరమణ అన్నారు. పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల్లో ఆశా వర్కర్లు(సీఐటీయూ)అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ మేరకు వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన ధరలకు అనుగుణంగా గౌరవ వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, విధి నిర్వాహణలో మృతి చెందిన వారికి దహన సంస్కారాల నిమిత్తం ఇస్తామన్న ఖర్చుల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక సీహెచ్‌వో ఎస్.వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకులు, జిల్లా భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.

16న రైతు సంఘం జిల్లా మహాసభలు



బలిజిపేటలో పోస్టర్‌ను విడుదల చేసిన రైతు సంఘం నాయకులు

బలిజిపేట: పాలకొండలో ఈ నెల 16న రైతు సంఘం మూడో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సభలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందుబాటులో లేకపోవడంతో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరను ప్రకటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే వాటికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలపడం దారుణమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు గోవింద, కార్యదర్శి సాంబమూర్తి, డి.త్రినాథ, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి



మార్కొండపుట్టిలో నిరసన తెలియజేస్తున్న రైతు కూలీ సంఘం, పీడీఎస్‌వో నాయకులు

మక్కువ: కురుపాం గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో కలుషిత నీరు తాగి, పచ్చకామెర్ల బారిన పడి ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు మృతి చెందారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ పి.అంజలి, టి.కల్పన వారం రోజుల వ్యవధిలో మరణించారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ మరణాలకు కారణమంటూ మంగళవాం మార్కొండపుట్టిలో రైతు కూలీ సంఘం, పీడీఎస్‌వో ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లలో సురక్షిత తాగునీరు, వైద్య సౌకర్యాలు కల్పించాలని, జీవో 107, 108లను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి



గురుకుల పాఠశాలలోని తాగునీటి బోరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కురుపాం: స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతూ మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన..అక్కడి విద్యార్థుల కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు చనిపోయి వారం రోజులైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సందర్శించిన దాఖలాలు లేవన్నారు. పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఇవ్వాలని, అలాగే ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల కుటుంబాలకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా..



రహదారికి మరమ్మతులు చేస్తున్న పిన్నింటి కుటుంబీకులు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి మేజరు పంచాయతీ 5వ వార్డు(సుంకరివీధి)లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పంచాయతీ పాలకులు పరిష్కరించకపోవడంపై కాలనీ, సుంకరివీధి ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ, సుంకరి వీధుల్లో పైడితల్లి అమ్మవారి గుడికి వెళ్లే రహదారి పిచ్చి మొక్కలతో నిండి ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులే మంగళవారం శ్రమదానంతో రహదారి సౌకర్యం ఏర్పరుచుకున్నారు. పైడితల్లి అమ్మవారి మొక్కులు చెల్లించుకునేందుకు ఈ మార్గం బాగు చేయాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పిన్నింటి కుటుంబీకులు రహదారి మరమ్మతులకు పూనుకున్నారు. అనంతరం ఆలయానికి ఘటాలతో వెళ్లారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

పాలకొండ: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పోరుకు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని పాలవలస రాజశేఖరం నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు వైద్య విద్యను దగ్గర చేయాలన్న సదుద్దేశంతో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మాత్రం ఆ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనే కుట్ర అని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని, నియోజకవర్గ కేంద్రం నుంచి వాహనాల ద్వారా అనకాపల్లికి చేరుకు ని జగనన్నకు మద్దతుగా నిలవాలని, పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య విద్య అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు దమలపాటి వెంకటరమణనాయుడు, కనపాక సూర్యప్రకాశరావు, వెలమల మన్మథరావు పాల్గొన్నారు.

సీజేఐ గవాయిపై దాడికి నిరసన





సాలూరు: జస్టిస్ గవాయిపైకి బూటు విసరడాన్ని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు, బలిజిపేట: రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

సాలూరు: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపైకి కోర్టులోనే ఓ సీనియర్ న్యాయవాది బూటు విసరడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ, బహిరంగంగా కోర్టు గదిలో సీజేఐ గవాయిపై బూటు విసరడం దిగ్భ్రాంతిని కలిగించేలా ఉందన్నారు. దేశంలో భాజపా ముఖ్యమంత్రులు, మంత్రులు, నేతలు కులచిచ్చును ప్రజల మధ్య పెంచుతున్నారని, మతోన్మాద వ్యాఖ్యలు నిరంతరం చేస్తున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. ఇటువంటి ఘటనలే నేడు జడ్జిపై బూటు వేసే ధైర్యాన్ని కూడా తెచ్చాయని విమర్శించారు. దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛకు, అసంతృప్తి తెలియజేసే హక్కుకు రక్షణ లేకపోతే అట్టడుగు వర్గాల గొంతు నొక్కేయడమే అవుతుందన్నారు. ఫలితంగా రాజ్యాంగంలో ఇచ్చిన హక్కులకు విలువ ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. మేధావులు, ప్రజలంతా ఇటువంటి ఘటనలను ఖండిస్తూన్నే, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, రవి, ప్రసాద్ ,శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద దాడికి నిరసనగా రాస్తారోకో

బలిజిపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై సనాతన ధర్మానికి మద్దతుగా నిలిచే మతోన్మాదం తలకెక్కిన న్యాయవాది దాడికి యత్నించడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేటలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి వేణు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక లాయరు చెప్పు విసిరేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. దీనికి బదులుగా సీజేఐ సంస్కారంతో వ్యవహరించి తన వృత్తి ధర్మాన్ని కొనసాగించడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. లాయర్‌పై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మతోన్మాదాన్ని ప్రోత్సహించే దాడులను ప్రజలంతా ఖండించాలని సీపీఎం మండల కార్యదర్శి మన్మధరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, త్రినాథ, సాంబమూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.